తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
26 జూలై 2026



## కొండేరు - జింకలపల్లి - శేకుపల్లి గ్రామాల
# ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో ఉందా?

**ఎర్రవల్లి, జులై 25 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండలంలో విర్ఫో అగ్రో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్న దుర్వాసన, పొగ, రసాయన కాలుష్యం కారణంగా మా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.రాత్రి సమయంలో వచ్చే దుర్వాసనతో నిద్రపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములు, పశువులు, నీటి వనరులపై ప్రభావం పడుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు.

**లాభాల కోసం ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడకండి!**

**మా గ్రామాల ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు:**

గాలి నాణ్యత పరీక్షలు జరిగాయా?

కాలుష్య నియంత్రణ చర్యలు సరైనవేనా?

ప్రజల ఆరోగ్యంపై అధ్యయనం జరిగిందా?

కొండేరు - జింకలపల్లి - శేకుపల్లి గ్రామాల ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యాక్టరీపై తక్షణ కాలుష్య తనిఖీ చేయాలి. గాలి, నీటి నమూనాలను పరీక్షించాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వరకు కఠిన చర్యలు తీసుకోవాలి. మాకు పరిశ్రమలు కావాలి... కానీ ప్రజల ప్రాణాలను కాపాడే పరిశ్రమలే కావాలి!

**ప్రజల ఆరోగ్యం ముందు - కంపెనీ లాభాలు తర్వాత!**

కొండేరు, జింకలపల్లి, శేకుపల్లి కాలుష్య వ్యతిరేకపోరాటం ప్రజలఆరోగ్యం కోరుకుంటున్నది.

## మహాయాగానికి మంత్రి జూపల్లి.. భక్తి సంద్రంగా కల్వకుర్తి

- 91వ శ్రీకృష్ణ కాలచక్రం విశ్వశాంతి మహాయాగంలో ప్రత్యేక పూజలు
- కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఠాకూర్ ద బాలాజీ సింగ్
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు..ఆధ్యాత్మిక వాతావరణంలో యాగశాల





కల్వకుర్తి,జూలై 25,(జనంసాక్షి):కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో జరుగుతున్న 91వ శ్రీకృష్ణ కాలచక్రం విశ్వశాంతి మహాయాగ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగింది. మహాయాగానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగం నిర్వాహకులు, వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్ కూడా కుటుంబ సమేతంగా హాజరై యాగంలో పాల్గొన్నారు. యాగశాలలో వేదమంత్రాల నడుమ నిర్వహించిన హోమాలు, పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక గురువులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాగశాల అంతా భక్తులతో కిటకిటలాడగా,విశ్వశాంతి, లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న మహాయాగం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్

- అన్ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి
- భోజనం, చదువు, క్రీడలు ప్రతి విద్యార్థి దినచర్యలో ఉండాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, జులై 15 (జనంసాక్షి):** విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం జిల్లాలోని చేగుంట మండల పరిధిలో గల కేజీబీవీని కలెక్టర్ సందర్శించారు. ముందుగా 06,07 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు, 08 వరకు టేబుల్స్ చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను పరిశీలించారు, ఫాస్ట్ మ్యాథ్స్, గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. కొన్ని కంప్యూటర్లు మరమ్మతులు గురికాబడినవని కలెక్టర్ తెలుసుకొని వెంటనే బాగు చేయించి అందరికీ ఆన్ అకాడమీ అందుబాటులో తీసుకురావాలన్నారు. వంట గదిలోకి వెళ్లి, వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

డైట్ చార్ట్ ప్రకారం వంటలు చేశారా? లేదా? అని అడిగి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కేజీబీవీ పరిసరాల చుట్టూ పారిశుధ్య నిర్వహణ బాగుండాలని, ఎలాంటి చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ను లికలెక్టర్‌లి ఆదేశించారు. అన్ని కేజీబీవీ లలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.అందరికీ అన్ని అంశాలు తెలియదని, ప్రతిరోజూ చదివితే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభ తరం అవుతుందని యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగ పడతాయన్నారు.

ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నీ బోధించాలన్నారు సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, బిడబ్ల్యూఓ హేమా భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గణాంక అధికారి నవీన్ కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేట జిల్లా విద్యా ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 25(జనంసాక్షి):** విద్యా ఫలితాల్లో వచ్చే సంవత్సరం రాష్ట్రంలోనే నారాయణపేట జిల్లా మొదటి స్థానంలో నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం మరికల్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ సెంటర్‌లో మరికల్ మండలంలోని ఇంటగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూశిక్షణ ఎలా జరుగుతోంది, ఉపాధ్యా యులు ఎలా బోధిస్తున్నా రు అనే విషయాన్ని ప్రత్య క్షంగా చూడాలనే ఆసక్తితో శిక్షణ కార్యక్రమానికి వచ్చా నని తెలిపారు. వచ్చే ఏడా ది మన జిల్లా విద్యా ఫలితా ల్లో మరింత మెరుగైన స్థాయికి చేరుకొని, రాష్ట్రం లో మొదటి స్థానంలో నిలవాలని ఆమె ఆకాంక్షిం చారు. ఇప్పటి నుంచే మనమంతా కలిసి కృషి చేస్తే ఆ లక్ష్యాన్ని తప్పకుం డా సాధించగలం అన్నారు. రెండు రోజుల క్రితం ధన్వాడ మండలంలోని మందిపల్లి పాఠశాలను సందర్శించోడం జరిగిందని,అక్కడ ఒక ఉపాధ్యాయుడు పిల్ల లకు ఎంతో చక్కగా బోధించడం చూశానని, పిల్లలతో నిరంతరం సంభాషిస్తూ, పాటలు, మ్యాప్‌లు వంటి బోధనా సామగ్రిని ఉపయోగించి, వారు మరచిపోకుండా నేర్పించడం ప్రధానం అన్నారు. పిల్లలు నేర్చుకు న్న విషయాలను గుర్తుంచు కోవడమే ముఖ్యమైన లక్ష్యం అని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంలో ఇంగ్లీష్, గణితం వంటి ప్రాథమిక అంశాలు ఎంతో కీలకం అన్నారు.ఈ బలమైన పునాదిపైనే వారి భవిష్య త్తు విద్య నిర్మాణం జరుగు తుందన్నారు.అందుకే ప్రతి ఉపాధ్యాయుడు బోధనను మరింత ఆసక్తికరంగా, పిల్లల భాగస్వామ్యంతో నిర్వహిస్తే వారు నేర్చుకున్న విషయాలను ఎప్పటికీ మర్చిపోరనీ, పిల్లలు టీవీ లోచూసిన పాటలు, సిని మాలు ఎందుకు గుర్తుంచు కుంటారంటే, అవివారి మనసులో బలంగా ముద్రపడతాయని చెప్పారు. అదే విధంగా వీడియోలు, డిజిటల్ పాఠాలు, ఆన్‌లైన్ బోధనా వనరులను కూడా ఉప యోగిస్తే వారు త్వరగా అర్థం చేసుకుని ఎక్కువ కాలం గుర్తుంచు కుంటారన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా మనం కొత్త పద్ధతులను నేర్చుకుంటామనీ, ప్రతిరోజూ ఒకే విధంగా బోధించడం కాకుండా, కొత్త ఆలోచనలు, వినూత్న బోధనా పద్ధతులు, బోధనా సామగ్రిని ఉపయోగించడం ద్వారా ఉపాధ్యాయులకు కూడా సంతృప్తి కలుగు తుందనీ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కొంత అదనపు శ్రద్ధ, సమయం,శక్తి కేటాయించడం చాలా అవసరం అన్నారు.గ్రామీ ణ ప్రాంత విద్యార్థులు ఎన్నో సామాజిక, ఆర్థిక సవాళ్ల మధ్య నుంచి వస్తుంటారనీ తెలిపారు. భవిష్యత్తు తరాన్ని తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యా యుల చేతుల్లోనే ఉందని ఆమె పేర్కొన్నారు. తాను ఎప్పుడూఉపాధ్యాయులకు ఒక విషయం చెబుతుంటానని, తల్లిదండ్రులు చెప్పిన మాట కంటే, ఉపాధ్యాయులు చెప్పిన మాటనే పిల్లలు ఎక్కువగా నమ్ము తారన్నారు. ఒక విద్యార్థికి “నువ్వు చేయలేవు” లేదా “నీకు మార్కులు రావు” అని చెప్పితే, అతను అదే నిజమని నమ్మి ముందుకు సాగలేడనీ,నా జీవితంలో కూడా అలాంటి అనుభవం ఉంది అని ఆమె గుర్తు చేశారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి మాట పిల్లల మనసు లో బలంగా నిలిచిపో తుందనీ,అందుకే మీరు చెప్పే ప్రతి మాట, చేసే ప్రతి పని విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలనీ చెప్పారు. భాషలోనూ, ప్రవర్తనలోనూ, బోధనలోనూ మీరు సరైన ఉదాహరణగా ఉండాలనీ సూచించారు. మన నారాయణపేట జిల్లా వెనుకబడిన ప్రాంతం అయినప్పటికీ, ఇక్కడ ఎంతో ప్రతి భావంతులైన ఉపాధ్యా యులు, మంచి విద్యార్థులు ఉన్నారనీ, అందువల్ల మీ బాధ్యత కూడా అంతే ఎక్కువగా ఉంటుందన్నారు.మీ అందరూ ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో పూర్తిగా అమలు చేస్తారని ఆశిస్తు న్నాననీ, జిల్లా యంత్రాంగం కూడా మీకు అవసరమైన ప్రతి విషయంలో అండగా ఉంటుందనీ ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఎఫ్ ఎల్ ఎన్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మూడో స్థానంలో నిలిచి నందుకు జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులును కలెక్టర్ శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామ్ కోటి, ఎంఇవో కరిముల్లా, ఏఎంవో విద్యాసాగర్, మాస్టర్ ట్రైనీ లు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు అండగా పోలీసు అక్క...

- బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావు





పెద్ద శంకరంపేట జూలై 25(జనంసాక్షి): బాలికల భద్రతకు అండగా పోలీసు అక్క నిలుస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పేర్కొన్నారు.శనివారం పెద్ద శంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పోలీసు అక్క కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైన భయపడకుండా పోలీస్ అక్కను సంప్రదించాలని సూచించారు. మహిళలు బాలికల భద్రతకు పోలీస్‌శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి పోలీసు అక్కలు కృషి చేస్తారని తెలిపారు మహిళల భద్రత సైబర్ నేరాలు ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ బాల్య వివాహాలు మాదక ద్రవ్యాల దుష్ప్రయోజనాలు.. మహిళ శిక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు ఓటీపీలు బ్యాంకు సమాచారం పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 షీ టీమ్స్ ఆశ్రయించాలని సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు. పాఠశాలలో పోలీస్ అక్కలు విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు సామాజిక బాధ్యత పెంపొందించేలా ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి సమస్య ఎదురైన దాచిపెట్టకుండా పోలీస్ అక్కకు తెలియజేయాలని విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్ సిఐలు రేణుక రెడ్డి సందీప్ రెడ్డి పెద్ద శంకరంపేట అల్లాదుర్గం రేగోడు ఎస్సైలు ప్రవీణ్ రెడ్డి శంకర్ పోచయ్య. పోలీసు అక్క గౌతమి. కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయ పోలీసు సిబ్బంది ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు...



పెద్ద శంకరంపేట, జూలై 25 (జనంసాక్షి): ఆషాడ తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలోని విఠలేశ్వర దేవాలయం.. మాణిక్ ప్రభు దేవాలయం. వేణుగోపాలస్వామి ఆలయం. తదితర ఆలయాలలో భక్తులు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విఠలేశ్వర మందిరంలో ఉదయం నుండి రుక్మిణి విఠలేశ్వర స్వామి వారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులు ఆషాడ తొలి ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు రాయల కృష్ణశర్మ, అభిలాష్ శర్మ. సంగప్ప పంతులు తదితరులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

# జల సంరక్షణ పనులపై సమావేశం..

- ఎంపీడీవో క్రాంతి కుమార్



పెద్ద శంకరంపేట, జూలై 25 (జనంసాక్షి): జల సంరక్షణ పనులపై పెద్ద శంకరంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో క్రాంతికుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.శనివారం మేజర్ గ్రామపంచాయతీ అయిన పెద్ద శంకరంపేటలో విబిజి రాంజీ పథకం కింద చేపట్టనున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జల సంరక్షణ ఇంకుడు గుంతలు ఫామ్ పాండ్లు. బోర్వెల్ రీఛార్జ్. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ జంగం రేణుక. ఏపీఎం శకుంతల పంచాయతీ కార్యదర్శి రాజు ఈసి నవాజుద్దీన్ వాడు సభ్యులు స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా మేనేజర్ మెరుగు నరేష్



బెజ్జంకి, జూలై25, (జనంసాక్షి): మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌ను ఆదివారం సిద్దిపేట జిల్లా 108 అంబులెన్స్ మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు మెడికల్ పరికరాలు,మందుల నిల్వలు,ఇతర సామగ్రి పనితీరును తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను అందుబాటులో ఉంచు కోవాలని సిబ్బందికి సూచించారు. మండల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ అత్యవసర కేసు సమాచారం అందిన వెంటనే 30 సెకన్లలోపు అంబులెన్స్‌ను ప్రారంభించి బయలుదేరి,బాధితులకు అవసరమైన ప్రథమ చికిత్స అందిస్తూ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లోని అత్యాధునిక వైద్య సాంకేతిక పరికరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని తెలిపారు.విధుల్లో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకున్నా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో మెడికల్ టెక్నీషియన్ పరశురాం, పైలెట్ రాజమల్లు పాల్గొన్నారు.

# శాకాంబరీ రూపంలో ఎల్లమ్మ



నిజాంపేట, జూలై 25 (జనంసాక్షి): ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో గల రేణుక ఎల్లమ్మ దేవి శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. మహిళలు మంగళహారతులు, ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు సంమృద్ధిగా కురిసి పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. సర్పంచ్ ప్రవీణ్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వనదుర్గమ్మ సన్నిధిలో డీఈవో



పాపన్నపేట, జూలై 25 (జనంసాక్షి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. శనివారం మెదక్ జిల్లా విద్య శాఖాధికారి రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు శంకర శర్మ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట అక్షయపాత్ర మెదక్ ప్లాంట్ మేనేజర్ త్రిపాఠి, పవన్, రాకేష్,నాగరాజు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులు పరిశీలించిన వార్డు అధికారులు



మక్తల్, జూలై 25 (జనంసాక్షి): మఖ్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులో జోరుగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను శనివారం స్థానిక వార్డు కౌన్సిలర్ అల్మారి పావని, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా దాదాపు పదికి పైగా ఇందిరమ్మ ఇండ్ల బేస్ మెంట్ పనులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని, లబ్దిదారులు సైతం వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అన్నారు. పనులు పరిశీలించిన వారిలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాలం, ఏఈ వినయ్ కుమార్, వార్డ్ ఆఫీసర్ విష్ణు, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్మారి రవికుమార్, గుంతలి రవికుమార్, కల్వాల్ మహిబలి, మహమ్మద్, శంకర్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ తెచ్చిన తంటా... నష్టపోయిన పత్తి పంట



కృష్ణ, జూలై 25 (జనంసాక్షి): ఒక రైతు తన వాటి పంటకు క్రిమిసంహారక మందును శుక్రవారం డ్రోన్ ద్వారా పిచికారి చేయడంతో ఆ మందు చుట్టుపక్కల ఉన్న పట్టి పంటపై పడడంతో పత్తి పంట ఎండిపోయి రైతులు నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కృష్ణ మండలం పరిదిలోని ఐనాపూర్,తంగిడిగి,శివరులోని పత్తి సాగు రైతుల పొలాల మీద, వరి మందు పడటంతో చెట్ల ఆకులు అన్నీ వాడిపోయినాయి. పంట నష్ట పోవాల్సిన పరిస్థితి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 250 ఎకరాల పైన పత్తి మొక్కలు వాడిపోతున్నవి. దానికి కారణం పక్కనే ఉన్న కౌలు రైతు చేస్తున్న నాలుగురు ఆంధ్ర వాళ్ళ డ్రోన్ నిర్వహకుల సహాయంతో మందు కొట్టినందుకు అందరి పొలానికి వెళ్ళింది. దాని నుంచి నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చెందారు. వరి కలుపు మందు గాలి ద్వారా పక్కనే ఉన్న పత్తి పొలంలోకి పడటం వల్ల పత్తి మొక్కలు ఎండిపోవ డం, మాడిపోవడం జరుగుతున్నది..నష్టం జరగడానికి కారణాలు డ్రోన్ తో మందు పిచికారి చేసే సమయంలో గాలి పత్తి చేను వైపుఉండటం.మందు ప్రభావం లేదా ఇతర కలుపు మందుల ప్రభావం తో పత్తి ఆకులు ముడుచుకు పోయాయి, రంగు మారి ఎండిపో తాయి. తీసుకోవాల్సిన రక్షణ చర్యలునీటి తడి: వెంటనే పత్తి పొలానికి తేలికపాటి తడి (నీరు చక్కర) పిచికారీ చెయలని వ్యవసాయ అధికారులు తేలిపారు. మందు కొట్టిన నిర్వహకులపైనా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్




రేవల్లి, జూలై 25 (జనంసాక్షి): వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరావిపాకుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ గురువారం సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న మహేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. క్లాసులు ఏ విధంగా జరుగుతున్నాయని, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు.

**మౌలిక వసతుల కొరతపై ఆవేదన...**

పాఠశాల నిర్మించి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ప్రహరీ గోడ లేకపోవడం, ఆట స్థలం అధ్వానంగా ఉండటంపై మిద్దె మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ముందు గుట్ట, పొలాలు ఉండటంతో గతంలో పాములు వచ్చిన ఘటనలు జరిగాయని, విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. "ప్లే గ్రౌండ్‌లో పెద్దపెద్ద రాళ్లు ఉన్నాయి. పిల్లలు ఆడుకోవడానికి ఏ మాత్రం అనుకూలంగా లేదు. వీటన్నింటినీ తొలగించి ప్లే గ్రౌండ్‌ను చదును చేసి, పిల్లలు ఆడుకోవడానికి అనుకూలంగా తయారు చేయాలి" అని బీఎస్పీ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

**స్థానిక ఎమ్మెల్యే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి...**

విద్యార్థుల భద్రత, మెరుగైన వసతుల కోసం స్కూల్ కాంపౌండ్, ప్లే గ్రౌండ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి గారిని బీఎస్పీ పార్టీ నుండి కోరుతున్నామని మిద్దె మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బండరావిపాకుల బీఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షులు పూర్ణం యాదగిరి, హుస్సేన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాలపై
# రాష్ట్ర విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

**టేక్మాల్, జులై 25 (జనంసాక్షి):**
టేక్మాల్ మండలంలో రాష్ట్ర విజిలెన్స్ బృందం ఎస్‌పీ శ్రుతి కీర్తి, ఏఓ కోటేశ్వర్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, లైసెన్సులు, ధరల పట్టికలు, రైతులకు బిల్లుల జారీ విధానాన్ని అధికారులు పరిశీలించారు. అలాగే గ్రౌండ్ బ్యాలెన్స్, ఈ-పాస్ యంత్రంలోని నిల్వలు సరిపోతున్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని, ఓ-ఫారం, పీసీలు తదితర రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని దుకాణదారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించాలని, రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ఎరువుల విక్రయదారులపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం
# అందించిన జిఎంఆర్ ఫౌండేషన్



**కల్హేర్, జులై 25(జనంసాక్షి):** కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి సాయిలు కుమారుడు బ్యాగరి చింటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విషాదం నింపింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అంత్యక్రియల నిర్వహణ కోసం ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా గుఱ్ఱపు మచ్చేందర్ మాట్లాడుతూ,కుటుంబానికి అండగా ఉంటామని, ఇలాంటి విషాదాలు ఎవరికీ రావద్దని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల రాములు, నాగిరెడ్డి, కుసంగి లక్ష్మయ్య,మాజీ వార్డుమెంబర్ సాయిలు, చాకలి భూపతి, కమ్మరి పండరి, గుమ్మడి పండరి, రమేష్, రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగుడుకు బానిసైన వ్యక్తి అనుమానాస్పద మృతి

- **కుళ్ళిపోయిన స్థితిలో మృత దేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**నంగునూరు, జూలై 25(జనంసాక్షి):**
నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామానికి చెందిన మహమ్మద్ జహంగీర్ (50) అనుమానాస్పద స్థితి లో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్ళిపోయిన స్థితిలో మృత దేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం జహంగీర్‌కు సుమారు 30 సంవత్సరాల కిందట వివాహం అయ్యింది. 20 సంవత్సరాలుగా మద్యానికి బానిస కావడంతో అతని భార్య హైదరాబాద్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతను తనతల్లి ఫరీదాబేగంతో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన జహంగీర్ తన తల్లితో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన కుమార్తె ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు జాంగిర్ ఇంట్లో మృతదేహంగా పడి ఉండటాన్ని గుర్తించారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. తన కుమారుడు మద్యానికి బానిసై మృతిచెందాడని అతని మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని తల్లి మహ మ్మద్ ఫరీదా బేగం(70) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## జలసిరిపై.. గ్రామసభ



**నిజాంపేట, జులై 25 (జనంసాక్షి):**
ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో రాజీరెడ్డి సూచించారు. నిజాంపేట మండలం నగరం గ్రామంలో శనివారం విబిజిరామ్ జి పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమాన్ని సర్పంచ్ సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రాజీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, పంట పొలాల్లో పంట కుంట, ఊరికి ఊటకుంట, కమ్యూనిటీ సోక్ ఫీట్, బోర్వెల్ రీఛార్జ్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా ఇంటికి కి మొక్కలు పంపిణీ చేసి, మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరు
## ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, జూలై 25 (జనంసాక్షి):**
కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) లో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు నమోదు చేసుకొని పటాన్చేరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు.అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా ఉద్యోగులు అధికంగా నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్లు, కాలనీలలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జులై 25 వ తేదీ వరకు 59 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని.. మరో 20 శాతం వరకు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు అత్యంత కీలకమని.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార వాహనాలు, సోషల్ మీడియా ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మహాదేవ రెడ్డి, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, చంద్రశేఖర్, దాసు, జగదీష్, అధికారులు మనోహర్, నరసింహ, అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా నూతన పదాధికారుల సన్మానం

- **పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలి: ఎంపీ రఘునందన్ రావు**



**నంగునూరు, జూలై 25 (జనంసాక్షి):** అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు బీజేపీ సిద్ధిపేట జిల్లా నూతన పదాధికారులకు సూచించారు. ఇటీవల సిద్ధిపేట జిల్లా నూతన కమిటీని ప్రకటించిన నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు (పదాధికారులు) మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని రఘునందన్ రావు సన్మానించారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జిల్లా పదాధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తే పార్టీకి మరింత ఆదరణ లభిస్తుందని అన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ రోజురోజుకు బలోపేతం అవుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత ప్రజాదరణ పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పదాధికారులు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీకి అంబాసిడర్‌లా పని చేసి ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని పిలుపునిచ్చారు. జిల్లా పదాధికారులు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విభీషణ్ రెడ్డి, ఖమ్మం వెంకటేశం, నత్తి మల్లేశం, ఉపాధ్యక్షులు తొడుపునూరి వెంకటేశం, సుభాష్ రెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్, బాల్ రెడ్డి, భాగ్యలక్ష్మి, కుమార్ గౌడ్, కార్యదర్శులు వాసరి యాదమల్లు, సురేశ్, కార్యాలయ కార్యదర్శి గుండ్ల జనార్ధన్, మీడియా కన్వీనర్ గోనె మార్కండేయులు, సోషల్ మీడియా ఇన్చార్జి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి రాజీనామా ప్రజా పోరాట విజయమే..

- **బీజేపీ పతనానికి నాంది: సీపీఐ నాయకుడు రమేష్**



**వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి):**
నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజా ఉద్యమాలు, యువత, విద్యార్థుల ఐక్య పోరాట ఫలితమని, ఇది బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురుదెబ్బగా నిలిచిందని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. శనివారం వనపర్తిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థి, యువజన ఉద్యమాలపై ఎలాంటి అణచివేత చర్యలు చేపట్టినా ప్రజా శక్తి ముందు ఏ ప్రభుత్వం నిలవలేదని అన్నారు. ప్రజల ఐక్య పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రి రాజీనామాకు దారితీసిందని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఉద్యమాల సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన 23 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ఉద్యమకారులపై నమోదైన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలకు సీపీఐ ఎప్పుడూ అండగా ఉంటుందని, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్వయంగా ఉద్యమానికి మద్దతు ప్రకటించారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కూడా ఉద్యమంలో పాల్గొని గాయపడడం విద్యార్థి ఉద్యమాల పట్ల వారి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మాదిరిగానే యువత, విద్యార్థుల పోరాటాలు దేశ రాజకీయాల్లో మార్పులకు నాంది పలుకుతాయని రమేష్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉపాధి కల్పన, రైతుల సంక్షేమ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించే ఏ ప్రభుత్వానికైనా ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, జయమ్మ, పృథ్వీనాథం, చిన్న కుర్మయ్య, గోపాలకృష్ణ, శేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల రక్షణలో ఉపాధ్యాయులదే కీలక బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర





సంగారెడ్డి బ్యూరో, జూలై 25(జనంసాక్షి): పిల్లల రక్షణలో ఉపాధ్యాయులదే కీలక బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర అన్నారు.సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఒక రోజు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.భవానీ చంద్ర మాట్లాడుతూ..ప్రతి చిన్నారికి సురక్షితమైన, భయరహిత విద్యా వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలపై వేధింపులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరా లపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జిల్లాలోని 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమించిన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమర్థవంతంగా పనిచేసి పిల్లల భద్రతను బలోపేతం చేయాలని అన్నారు. గుడ్ టచ్–బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యం, బాలల హక్కులపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్యతో పాటు న్యాయమూర్తులు, విద్యా శాఖ, మహిళా–శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమంపై గ్రామసభలో అవగాహన



కొల్చారం, జూలై 25(జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో బీవీజీ రామ్‌జీ ఫామ్ ఫౌండేషన్– జలసిరి కార్యక్రమం ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురుకానున్న వర్షాభావం, నీటి ఎద్దడిని అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు (పంట కుంటలు), ఊట కుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని గ్రామసభలో వివరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, పంట పొలాల్లో వర్షపు నీరు వృధా కాకుండా ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్, ఉప సర్పంచ్ కోరంపల్లి రాణి గోపి, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, ఏపీవో మహిపాల్ రెడ్డి, ఎంపీవో పోచయ్య, జీపీవో స్వామి దాస్, కరోబార్ వర్ల ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజం, వార్డు సభ్యులు కృష్ణ, అంజనిపుత్ర, సత్యనారాయణ, షేకులు, వనమాల శ్రీధర్, బీఎల్‌వోలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎస్పీ ప్రసన్న కుమార్

టేక్మాల్, జూలై 25 (జనంసాక్షి): టేక్మాల్ పోలీస్ స్టేషన్ను డీఎస్పీ ప్రసన్నకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేస్ ఫైళ్లను తనిఖీ చేసి, సిబ్బంది వివరాలను ఎస్ఐ అరవింద్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల స్నేహభావంతో వ్యవహరిస్తూ, మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూత్ ఫర్ యాక్షన్ వారి ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



శ్రీరంగాపూర్, జూలై 25 (జనంసాక్షి): కంబలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో యూత్ ఫర్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంఈఓ, హనుమంతు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఎం.శేఖర్, మల్లేష్ ఎస్ రాముడు, ఎం మహేష్ తదితరులు పాల్గొని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు యూత్ ఫర్ యాక్షన్ సమస్త ద్వారా బ్యాగులను అందించినందుకు ఏం.శేఖర్‌ను పాఠశాల యాజమాన్యం శాలువాతో సన్మానించడం జరిగినది. మును ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరి ఎన్నో చేయాలని వారు అభిశంసించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## మల్కాపూర్‌లో ఘనంగా వన మహోత్సవం



తూప్రాన్, జూలై 25(జనంసాక్షి): తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని చనిగే చెరువు కట్టపై ఎక్సైజ్ ఎస్ఐ ఎండి అజీజ్ అహ్మద్‌తో కలిసి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించాలంటే ఈత మొక్కల పెంపకం ఎంతో అవసరమని అన్నారు. సహజ సిద్ధంగా లభించే ఈత కల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గౌడ కులస్తులు స్వచ్ఛందంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే పచ్చదనంతో కూడిన గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉప సర్పంచ్ స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ గోపి నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, పాలకవర్గ సభ్యులు, గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటి వన సంరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.

## జడ్పీ హైస్కూల్ నూతన భవనానికి రూ.1.62 కోట్లు మంజూరు

- మంత్రి దామోదర రాజనర్సింహకు పాలాభిషేకం



మునిపల్లి, జూలై 25 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దచెల్మెడ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా రూ.1.62 కోట్లు మంజూరు చేయడంతో మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లోడి సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మండల సీనియర్ నాయకుడు సంగన్న, గ్రామ సర్పంచ్ రాధాబాయి జోషి, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, గ్రామ యూత్ అధ్యక్షుడు ఇస్మాయిల్, పాఠశాల హెడ్‌మాస్టర్ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వాణి పాల్గొన్నారు.

## ఎర్రవల్లి మండల బిఎల్ఏలతో ముఖాముఖి సమావేశం

- బూత్‌స్థాయి నాయకులకు దిశ నిర్దేశం
- అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్



ఎర్రవల్లి, జూలై 25(జనంసాక్షి): అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండల కేంద్రంలో అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ఎర్రవల్లి మండలంలోని బిఎల్ఎలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ సంపత్ కుమార్,నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్చార్జి సిద్దేశ్వర్ కిమొదటగా ఎర్రవల్లి మండల కేంద్రంలోని నంద ఘన స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అత్యద్భుత కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లటంలో మనమందరం ముందుండాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేదల అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చే పార్టీ అని ఇట్టి కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన పార్టీ సంస్థాగత బలోపేతం బూత్ స్థాయి కార్యాచరణ సర్ కార్యక్రమం అమలు ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లే విధానం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో బిఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ గారు పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ఉన్నటువంటి ఓటర్ మహాశయులందరికీ తెలిసేలా ముందుకు తీసుకువెళ్లాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది. ప్రతి బూత్‌లో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

ఎర్రవల్లిలో బిఎల్ఏలతో విజయవంతంగా ముఖాముఖి సమావేశం, పార్టీ సంస్థాగత బలోపేతంపై సమగ్ర చర్చ, బూత్ స్థాయిలో కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని పిలుపు.

ఈ సమావేశంలో అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్పై సంపత్ కుమార్ గారు నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జి సిద్దేశ్వర అలంపూర్ నియోజకవర్గ బిఎల్ఏ ల ఇన్చార్జి షేక్షావలి ఆచారి ఎర్రవల్లి మండల పార్టీ అధ్యక్షులు పుటాన్ దొడ్డి వెంకటేష్ యాదవ్ మరియు ఇన్చార్జిలు జిల్లా నాయకులు ఆయా గ్రామాల బి ఎల్ ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి.. జనసంద్రమైన శ్రీ అభయుడి ఆలయం



ఉర్కొండ, జూలై 25, (జనంసాక్షి): ఉర్కొండ మండలం ఊరుకొండ పేట మండలంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని శనివారం రోజు భక్తులతో ఆలయం కిక్కిరిసి పోయింది. ఉదయం గ్రామంలోని శ్రీ స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని అర్చకుల గృహము నుండి బయలుదేరి గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో దేవాలయమునకు ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు, ప్రజా ప్రతినిధులు భజనలతో తీసుకురావడం జరిగింది.

ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు,అభిషేకాలు, అలంకరణలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఉపవాసం ఉండి భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భజనలు, హారతులతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. ఆలయానికి వచ్చేభక్తులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లను చేసినట్లు చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, సర్పంచ్ అబ్బుల్ రషీద్ , ఉప సర్పంచ్ రేపని శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు, భజన మండలి సభ్యులు,తాజా , మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, దేవాలయ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శివంపేట్‌లో రూ.1 కోటి వ్యయంతో నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం



చెట్యాల్, జూలై 25 (జనంసాక్షి): మండలంలోని శివంపేట గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.గ్రామంలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుదల, రవాణా సౌకర్యాల అభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తిక దశరథ్ సర్పంచ్ సంధ్య మల్లికార్జున్ గౌడ్ ఉపసర్పంచ్ నత్తి సందీప్ కుమార్ గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ దూడ భూదేవి కుటుంబానికి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి చేయూత



మెదక్ టౌన్ జూలై 25, (జనంసాక్షి): మెదక్ పట్టణంలోని పిల్లికోటల్ డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన కామ్రేడ్ దూడ భూదేవి మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన పట్టణ నాయకుల ద్వారా మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దూడ భూదేవి చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు చంద్రమోహన్ గౌడ్, తలారి సంతు, నాగరాజు, జగదీష్, కిరణ్ గౌడ్, వడ్ల నాగరాజు, ఇప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కలకలాడుతున్న దేవాలయాలు



మిడ్జిల్, జూలై 25(జనంసాక్షి): స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షమి ఏకాదశి జ్యేష్ఠ నక్షత్రం తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశ పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారినీ దర్శనం చేసుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తెల్లవారుజాము నుంచి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగినది ఓం నమో వెంకటేశాయ ఓం నమో శ్రీనివాసాయ శ్లోకాలతో దేవాలయాలు మారుమోగాయి. ఏకాదశి రోజు భక్తులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలం అని అనాదిగా వస్తున్న ఆచారాన్ని భక్తులు తప్పకుండా పాటించారు.

## ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన నాయకుడు ఎర్ర సత్యం



మిడ్జిల్, జూలై 25(జనంసాక్షి):పేద ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ముద్ర వేసుకొని నిలిచిపోయిన ప్రజానాయకుడు ఎర్ర సత్యం అని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. శనివారం ఎర్ర సత్యం జయంతి సందర్భంగా వాడ్యాల గేటు దగ్గర ఎర్ర సత్యం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా టిడిపి నాయకుడిగా ప్రజలకు అందుబాటులో ఉండి కసుషుల్లో ఆపదలో ఆదుకొని ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు ఎర్ర సత్యం అని అన్నారు ముదిరాజు ముద్దుబిడ్డ బిసి నాయకుడు కోల్పోవడం ఎంతో బాధాకరమని ఎర్ర సత్యం అడుగుజాడల్లో ముదిరాజ్ నడుస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ముదిరాజుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్యుడి విగ్రహానికి భూమిపూజ



చిన్న శంకరంపేట్ జూలై 25(జనంసాక్షి): చందంపేట గ్రామంలో ఈరోజు ఏకలవ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది అనంతరం. ఏకలవ్యుడి విగ్రహానికి భూమి పూజచేసిన సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సంతోష్ కుమార్ ఉప సర్పంచ్ నర్సింలు పాలకవర్గం సభ్యులు ఏకలవ్య యువజన సంఘం సభ్యులు. మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రాజీనామా నేపథ్యంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంబరాలు



వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి): కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి, నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ, యువత, విద్యార్థులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో సాగిన ఉద్యమ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రి రాజీనామాకు దారితీసిందని పేర్కొన్నారు. ప్రజల ఐక్య పోరాట శక్తికి ఇది నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులపై జరిగిన లాఠీచార్జి ఘటనపై అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణు, నాయకులు రమేష్, గోపాలకృష్ణ, రాజేష్, అశోక్, శేఖర్, వంశీ, బాలెమియా, దప్పు స్వామి, శివ, మల్లెపు నరసింహ, చందు, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కోహిర్ ప్రభుత్వ పశువైద్యశాలలో డాక్టర్ల కొరత

- సకాలంలో వైద్యం అందక జీవాల మృతి



కోహిర్, జూలై 25 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో అధికారుల పర్యవేక్షణ లోపించి నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఆసుపత్రిలో పశు వైద్యులు (డాక్టర్లు), సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి వచ్చే రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాధుల బారిన పడిన పశువులను, జీవాలను చికిత్స కోసం తీసుకొస్తే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

?అత్యవసర సమయంలో సరైన వైద్యం అందక పదుల సంఖ్యలో మేకలు, గొర్రెలు, పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇతర దూర ప్రాంతాలకు తీసుకెళ్లే లోపే జీవాలు ప్రాణాలు వదులుతుండటంతో నిరుపేద రైతులు వేలాది రూపాయల ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రైవేట్ వైద్యం చేయించుకునే స్తోమత లేక, ఇక్కడ పశువైద్యశాలలో పట్టించుకునే నాథుడు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. తమ జీవనోపాధికి ఆధారమైన జీవాలు కళ్లముందే చనిపోతుంటే పశుపోషకులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

?ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కోహిర్ పశువైద్యశాలలో పూర్తిస్థాయి డాక్టర్లను, సహాయక సిబ్బందిని నియమించాలని, అలాగే నిబంధనల ప్రకారం మృతి చెందిన జీవాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు, పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆదర్శ పాఠశాల విచారణ కమిటీపై ఆరోపణలు

- సమగ్ర విచారణ జరపాలి
- ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్



బెజ్జంకి,జూలై 25,(జనంసాక్షి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనపై జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. ఈ ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయంపై ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్వతంత్రంగా, నిష్పాక్షికంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. విచారణ ప్రక్రియపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు.ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత విచారణ కమిటీ సభ్యులపై కఠినమైన శాఖాపరమైన,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యావ్యవస్థలో అవినీతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని, విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల్లో నమ్మకాన్ని పెంపొందించేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.విచారణ నివేదికను బహిర్గతం చేసి,ఈ వ్యవహారంలో నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని ఏఐవైఎఫ్ తరఫునా డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.

## రేవల్లి గ్రామంలో మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం

- పోలీస్, షి టీమ్ ఆధ్వర్యంలో కళాజాత బృందం ప్రదర్శన



ఉర్కొండ, జూలై 25,(జనంసాక్షి); ఉర్కొండ మండలం రేవల్లి గ్రామంలో పోలీసు శాఖ, షి టీమ్ మరియు తెలంగాణ సాంస్కృతిక సంస్థ నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో మూఢనమ్మ కాలపై శుక్రవారం రోజు రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాజాత బృందం సభ్యులు ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు,మహిళల భద్రత, పోక్సో చట్టం, రహదారి భద్రత, బాల్య వివాహాల నిరోధం, మాదక ద్రవ్యాల నిరోధం, చేతబడి వంటి అంశాలపై కళా బృందం వారు తమ పాటల ద్వారా ప్రజలకు వివరించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్వకుర్తి సీఐ భీమ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను విడిచిపెట్టి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సందేశం ఇచ్చారు. అలాగే చేతబడి, తంత్రాలు, అంధవిశ్వాసాలపై నమ్మకం పెట్టుకోకుండా, అనుమానాస్పద విషయాలను పోలీసులకు లేదా గ్రామ పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఉర్కొండ ఎస్సై రమాదేవి హాజరై మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా షి టీమ్ ను ఆశ్రయించాలని, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. రహదారి నియమాలు పాటించడం, బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంగారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేతలపై మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆగ్రహం

• **బాధితులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం**



**నారాయణఖేడ్, జూలై 25 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండలం బెల్లాపూర్ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో చట్టబద్ధంగా నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాలపై నిర్మించుకున్న నివాస గృహాలను కూల్చివేయడాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పేద ప్రజలకు అండగా ఉంటామని, వారి హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.
బాధితులను పరామర్శించిన అనంతరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి, సంబంధిత ధృవపత్రాలు కూడా అందజేశామని గుర్తుచేశారు. అలాంటి కుటుంబాలు కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శిస్తూ, పేదలకు నివాస భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే వారిని నిరాశ్రయులను చేయడం బాధాకరమని పేర్కొన్నారు. నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సింది పోయి, ఇప్పటికే నివసిస్తున్న గృహాలను నేలమట్టం చేయడం సరైన విధానం కాదని భూపాల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ గృహ పథకం కింద ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే పేద ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, బిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నారాయణఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేశారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలి

• **జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.కృష్ణ**

**నాగర్‌కర్నూల్, జూలై 25 (జనంసాక్షి):** ప్రతి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. శనివారం నాడు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపైసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూప్రతి గర్భవతి 12 వారెళ్లపై తప్పనిసరిగా నమోదు చేయాలని, ముఖ్యంగా వారి రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి గర్భవతి కాన్పు అయ్యేలోపు కనీసం 11 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవల సంఖ్యను పెంచాలని వైద్యాధికారులకు సూచించారు. 14 సంవత్సరాల బాలికలందరికి గర్భాశ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి టీకాకరణపై అన్ని పాఠశాలల్లో తల్లి దండ్రులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వంద శాతం - 14 సంవత్సరాల పిల్లలందరికీ హెచ్ పి వి టీకా కరణ పూర్తి చేయాలన్నారు. 30 సంవత్సరాల వయసు పడిన ప్రతి ఒక్కరికి అసాంక్రమిక వ్యాధులైన అధిక రక్తపోటు, మధుమేహము కొరకు స్క్రీనింగ్ పరీక్షలు ఆగస్టు నెలలోపు పూర్తి చేయాలని, క్షేత్ర సహాయ సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో అంటు వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భీమానాయక్, డాక్టర్ తారా సింగ్, డిపిఓ రేనయ్య, ఎపీడీమియాలజిస్ట్ ప్రవల్లిక, ఏపీవోలు బాలస్వామి, విజయ్ కుమార్, కోట్ర నిరంజన్, శివకుమార్, డీడీఎంలు సందీప్ కుమార్, నవీన వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మెదక్ డయాసిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు



**మెదక్ టౌన్, జులై 25 (జనంసాక్షి):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా వుండాలని ఆకాంక్షిస్తూ మెదక్ డయాసిస్ ఆధ్వర్యంలో మెదక్ సిఎస్ ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థన కార్యక్రమానికి మెదక్ బిషప్ కమిస్సరీ రేవ. జయనంద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ శాంతి, సుభిక్షం కలగాలని దేవునికి ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. మెదక్ డయాసిస్ పరిధిలోని మూడు జిల్లా చర్చి కౌన్సిళ్ల (డీసీసీ) ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెదక్ లే సెక్రటరీ పెద్ది దేవసహాయ్, ప్రాపరేటి కన్వీనర్ మంత్రి సొలొమోను,మెదక్ డీసీసీ చైర్మన్ జార్జి ఎబినేజర్, వైస్ చైర్మన్ దేవదాస్, డయాసిస్ గురువులు రేవ. గడ్డి ప్రేమ్‌కుమార్, మెదక్ ప్రెస్బిటర్ ఇన్‌చార్జి రేవ. శాంతయ్య, మెదక్ చర్చి సెక్రటరీ గెలన్ చిత్తరంజన్, గంట సంపత్, సుశీల్, నోబుల్సన్ పలువురు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ తల్లి బోనాలకు తరలిరండి

**మెదక్ టౌన్, జులై 15 (జనంసాక్షి):** మెదక్ పట్టణములోని నల్ల పొచ్చమ్మ బోనాలు మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగునున్న బోనాలకు బిఆర్ ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠ రెడ్డి తిరుపతి రెడ్డికి ముదిరాజ్ సోదరులు బోనాల ఆహ్వాన పత్రికను బోనాల మహోత్సవానికి రావాలని కోరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల మహోత్సవం, ఆగస్టు 3న పలహారం బండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సున్నం.నరేష్,నిమ్మల నాగులు, తలారి.సంతోష్,ఇప్ప భరత్, తొడంగుల. సంపత్,లోకమైన మనోహర్, చింతల.కార్తీక్, ఆది శశాంక్, పురం హరిప్రసాద్, జంగిటి చరణ్, మహేష్, శశాంక్, ఇప్ప నరేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రచ్చన్న స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఘన సన్మానం



**కోహీర్ జులై 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రచ్చన్న స్వామి ఆలయ నూతన కమిటీసభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన టి.సువర్ణ మల్లన్న పాటిల్.ని పార్టీ కార్యాలయంలో, జగదీశ్వర్ స్వామి నేతృత్వంలో కమిటీ సభ్యులు శాలువా మరియు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. శ్రీ రచన్న స్వామి దేవాలయ అభివృద్ధికి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నూతన మండల అధ్యక్షులు తమ పూర్తి సహకారాన్ని అందించాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు టి. సువర్ణ మల్లన్న పాటిల్ మాట్లాడుతూ,ఆధ్యాత్మిక కేంద్రాలైన దేవాలయాల అభివృద్ధికి మరియు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో బడంపేట్. సర్పంచ్ దయానంద్ పాటిల్.మాజీ. జెడ్.పి.టి.సి రాందాస్. కవెల్లి కృష్ణ.మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాంపూర్ గ్రామంలో మద్యపానం నిషేధం

• **గ్రామసభలో తీర్మానం చేసిన సర్పంచ్, గ్రామపంచాయతీ ? పాలకవర్గం**



**నంగునూరు, జూలై 25, (జనంసాక్షి):**
నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేసుకొని గ్రామ యువకులు అందరూ కలిసి కట్టుగా వచ్చి మన గ్రామంలో బెల్ట్ షాపులు ఇష్టారీతిన నడుపుతుండటం వలన చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్న విషయాన్ని గ్రహించిన యువకులు ముందుకు వచ్చి మన గ్రామంలో మద్యపాన నిషేధం చేయాలని కోరిన వెంటనే గ్రామ సభలో తీర్మానం చేసి మద్యపాన నిషేధం చేయడం జరిగింది .ఇట్టి తీర్మానాన్ని అతిక్రమించి మద్యం అమ్మితే అమ్మినవారికి 50000 వేయిలరూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి ఉపసర్పంచ్ బొడిగె తిరుపతిగౌడ్ వార్డు సభ్యులు,వెంకటేష్,రాజు,పద్మ నర్సవ్వ,మాజీ ఎంపీటీసీ ఎనగందుల నితిన్ కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్,డ్రాక్రా గ్రూప్ లీడర్లు,ఆశా వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు, సీఏ ,మహిళలు మరియు యువకులు అరుణ్ రెడ్డి,ప్రగత్ రెడ్డి,రాజేష్,అమర్,గణేష్,నవీన్, నాగరాజు, వాసు గ్రామ పెద్దలు రాంరెడ్డి ,లింగం, యాదగిరి, తిరుపతి, శ్రీహరి, నర్సింలు ,బాపురెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో.. సులోచన



**వెల్దండ, జులై 25 (జనంసాక్షి):** వెల్దండ మండలంలోని పోతే పల్లి, లింగారెడ్డి పల్లి గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెల్దండ ఎంపీడీవో సులోచన అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రారంభం కానీ ఇందిరమ్మ ఇల్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లింగారెడ్డిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలించి , మొక్కల పెంపకం పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి మొక్కకు క్రమం తప్పకుండా నీరు అందించి, మొక్కలు పెరిగేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్, ఉప సర్పంచులు జోగు రాములమ్మ లింగమయ్య, శారద బాలయ్య గౌడ్, వార్డు సభ్యులు అశోక్ కుమార్, మార్కండేయుడు, ఉడుత శివ, ఎగిరిశెట్టి శివ, అల్లాజి, పుష్పమ్మ, శేఖర్, లక్ష్మయ్య, దేవదానం, పబ్బు శ్రీకాంత్, ప్రశాంత్ ,అంజయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో క్రిక్కిరిసిన శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం



**మల్దకల్ జూలై 25 (జనంసాక్షి):** నడిగడ్డ భక్తుల ఇలవేల్పు మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి శనివారం ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు బారులు తీరి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఉదయం నుండి దేవాలయంలో అర్చకులు, వాల్మీకి పూజారుల ఆధ్వ్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈవో సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తగు ఏర్పాటుచేసి క్యూ పద్ధతిలో స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఉదయం నుంచి భక్తులు ఏకాదశి సందర్భంగా ఉన్న ట్లుగా స్వామి వారిని దర్శించుకోవడానికి క్యూలైన్ ద్వారా వరస కట్టి దర్శించు కున్నారు. సద్దలోనిపల్లి శ్రీ కృష్ణస్వామి దేవాలయంలో ఏకహ సంకీర్తనలు నిర్వహించారు.

## ధర్మేంద్ర
## రాజీనామా విద్యార్థి శక్తి విజయం: బండి వేణు



నారాయణపేట, జూలై 25 (జనంసాక్షి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి శక్తి విజయమని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎబివిపి పూర్వ నాయకుడు బండి వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఐక్యత, పోరాట పటిమ ముందు ఎంతటి పెద్ద వ్యక్తి అయినా తలవంచాల్సిందేనని మరోసారి రుజువైందన్నారు. స్టూడెంట్స్ పవర్ -నేషన్ పవర్ అనే సూక్తి నేడు నిజమైందన్నారు. విద్యార్థుల హక్కులను కాల రాస్తూ, అక్రమాలకు పాల్పడిన ధర్మేంద్ర తన పదవికి రాజీనామా చేయడమే ఇందుకు రుజువు అన్నారు. వారం రోజులుగా విద్యా ర్థులు, యువత చేసిన శాంతియుత నిరసనలు, సోషల్ మీడియా ఉద్యమం, ప్రజల మద్దతు వల్లనే ఈ నిర్ణయం సాధ్యమైందన్నారు. ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు. ఇది ప్రజాస్వామ్యానికి, విద్యార్థి శక్తికి దక్కిన విజయం అన్నారు.విద్యా వ్యవస్థను కాపాడేందుకు, అవినీతికి తావు లేకుండా చేయడానికి విద్యార్థులు ఇకపై కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.ప్రజల గొంతు విన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల పోరాటానికి ఫలితం..
## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా..

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం.నారాయణ



మహమ్మదాబాద్, జూలై 25(జనంసాక్షి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయానికి నిదర్శనమని మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఇటీవల జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం,విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జి జరగడం దురదృష్టకరమని విమర్శించారు.విద్యార్థుల ఆవేదనను అణచివేయాలని చూసినా,చివరకు వారి ఉద్యమమే విజయాన్ని సాధించిందని అన్నారు.రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలపై కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన ఆరోపణలు అసత్యాలని, చివరికి నిజమే గెలిచిందని కేఎం నారాయణ వ్యాఖ్యానించారు.విద్యార్థుల శక్తిని ఏ ప్రభుత్వం తక్కువ అంచనా వేయరాదని, వారి హక్కుల కోసం జరిగే ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యల సాధనకై
## ఆగస్టు 1న తపాస్ మహాధర్నా



మాగనూర్, (జనంసాక్షి): ఉపాధ్యాయ సమస్యల సాధనకై ఆగస్టు 1న తపస్ మహాధర్నా ఉద్యమానికి చేయూత ఇవ్వాలి. మాగనూరు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల సాధన కోసం ఆగస్టు 1న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాగనూరు మండల అధ్యక్షులు బాబురెడ్డి తెలిపారు. మాగనూరు మండల కేంద్రంలో జరిగిన శిక్షణ కేంద్రం వద్ద జరిగిన మహాధర్నా గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న సమస్యల సాధన కోసం అనేకసార్లు విన్నవించిన ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే దశల వారి ఉద్యమ కార్యాచరణకు పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పిఆర్సి వెంటనే ప్రకటించాలని, ఆరు డీఏలు విడుదల చేయాలని, సిపిఎస్ విధానం రద్దు పరిచి పాత పెన్షన్ అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటిఎస్ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గణేష్ సింగ్, మండల ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా నాయకులు వెంకట్రాములు, తపస్ జిల్లా మండల బాధ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రాధాన్యతపై అవగాహన అవసరం

- డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్



గద్వాల నడిగడ్డ, జులై 25(జనంసాక్షి): కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫారాలను ఇచ్చినందున ఇంకా జిల్లాలో ఫామ్స్ పూరించి ఇవ్వని వారితో కలెక్ట్ చేసి నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 84 శాతం డిజిటలైజేషన్ జరిగిందని చెప్పారు. గతంలో పూర్తయిన మ్యాపింగ్ డేటాను సంబంధిత సూపర్వైజర్లు, బిఎల్వోలు మరోసారి చెక్ చేయాలన్నారు. ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నం దున వచ్చే వారంలో సంబంధిత అధికారులు మరింత బాధ్యతగా పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వందశాతం పూర్తయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తహసిల్దారులను ఆదేశించారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పనులు వేగవంతం కావాలని,లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కుల, ఆదాయ, రెసిడెన్షియల్, తదితర ధ్రువపత్రాలకై దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా సకాలంలో ఆయా సర్టిఫికెట్లను జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు రెవిన్యూ కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల,తహసిల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ఏరోస్పేస్ ఇన్‌స్టిట్యూట్ చేయూత

- జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు 16 సైకిళ్లు ఉచితంగా ఇవ్వడం
- స్కూల్‌కు మినరల్ వాటర్ ప్లాంట్ విరాళం
- ఏరోస్పేస్ ప్రతినిధులకు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల కృతజ్ఞతలు








చిన్నంబావి, జూలై 25 (జనంసాక్షి): సమాజ సేవే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఏరోస్పేస్ ఇన్‌స్టిట్యూట్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. చిన్నంబావి మండలంలోని బెక్కెం గ్రామ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి సంస్థ ప్రతినిధులు16 సైకిళ్ళు, మినరల్ వాటర్ ప్లాంట్ ను విరాళంగా అందజేశారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడంతో పాటు వారి సౌకర్యాలను మెరుగు పరిచే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. బెక్కెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల ఏరోస్పేస్ ఇన్‌స్టిట్యూట్ చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. లాభాపేక్ష లేకుండా విద్యార్థుల సంక్షేమం కోసం సంస్థ అందిస్తున్న సేవలు ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఏరోస్పేస్ ఇన్‌స్టిట్యూట్ సేవాభావాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరోస్పేస్ హెచ్ ఆర్ మాధురి, జిహెచ్ఎం విజయవర్ధిని, అనిత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీ దొడ్డిలో వ్యవసాయ విద్యుత్ కోతలపై రోడ్డెక్కిన రైతులు



కేటీదొడ్డి, జూలై 25(జనంసాక్షి): గద్వాల నియోజకవర్గంలో వ్యవసాయానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి విమర్శించారు. మండలంలోని కేటీ దొడ్డి కేంద్రం మైలగడ్డ స్టేజ్ సమీపంలో వ్యవసాయ విద్యుత్ కోతలను నిరసిస్తూ గురువారం రైతులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పూర్తి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా డీకే స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ… నియోజకవర్గంలో విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యల వల్ల రైతులు పంటలకు సరిపడా నీరు అందించలేక తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఉచిత విద్యుత్ వేళల్లో నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో మోటార్లు కాలిపోయి రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. పగటిపూట విద్యుత్ లేకపోవడంతో ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చి, లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో మైలగడ్డ స్టేజ్ వద్ద కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ రవిప్రసాద్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు, బీజేపీ నాయకులు ధర్నాను విరమించారు.

ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి పాల్గొని నిరసనను ఉధృతం చేశారు. వారితో పాటు ఉప సర్పంచ్ భీమ్ రెడ్డి, నాయకులు సాయి మోహన్ రెడ్డి, పవన్, తిరుమల్, నరసింహులు, సీనియర్ నాయకులు మైలగడ్డ రాములు, గంగన్ పల్లే జయన్న, కేటీ దొడ్డి అశోక్, దేవేందర్ రెడ్డి, నాగిరెడ్డి, ముంగిలి వీరేశ్, ఉమిత్యాల కర్రెప్ప, తిమ్మప్ప, కొండన్న, పాగుంట సర్పంచ్ అంజనప్ప, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, కృష్ణ కాంత్, రంగాపురం కృష్ణ, వావ్ నాయక్ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం: మాజీ మంత్రి

• వనపర్తి పట్టణం, పెద్దమందడిలో 'సర్' ప్రక్రియను పరిశీలించి ఓటరు నమోదుపై అవగాహన





**వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి):** ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని, అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణంతో పాటు పెద్దమందడి ప్రాంతంలో బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించిన ఆయన, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా పరిస్థితిని సమీక్షి స్తూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా తుది జాబితా లో నుంచి మినహాయింపుకు గురికాకుండా బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, పార్టీ శ్రేణులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ప్రతి అర్హుడి వివరాలు సకాలంలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రతి పౌరుడు తన ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్యం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొ న్నారు. వనపర్తి పట్టణంలో మొత్తం 63,246 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు సుమారు 67 శాతం మాత్రమే ఆన్‌లైన్ నమోదు పూర్తయిం దని తెలిపారు. మిగిలిన నమోదును వేగవంతం గా పూర్తి చేసి వంద శాతం నమోదు సాధించి వనపర్తిని ఆదర్శ పట్టణంగా నిలపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రఘుపతి రెడ్డి, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, దేవర్ల నర సింహ, గులాం ఖాదర్ ఖాన్, నీలస్వామి, జోహె బ్ హుస్సేన్, సయ్యద్ జమీల్, చిట్యాల రాము, బొబ్బిలి ప్రేమ్ కుమార్, చెన్నారెడ్డి, రఘు, పెద్దముక్కల రవి, సుధాకర్, వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్, శిరీవాటి శంకర్, ఖాదర్షా తదితరు లు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లిని సన్మానించిన వెల్దండ సర్పంచ్



**వెల్దండ, జులై 25 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ టెలికాం మైదానంలో ఆరు రోజుల నుంచి నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవ చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసౌర, సుదర్శన, విష్ణు పంచాయతనం, లక్ష్మీనారాయణ సహిత శ్రీ మద్భాగవత కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం వారితో కలిసి వేడుకలలో పాల్గొన్నారు. యాగశాల వద్దకు చేరుకున్న మంత్రికి పండితులు ఘన స్వాగతం పలికారు. మంత్రి ఎమ్మెల్యేతో పాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర పొల్యూషన్ కమిటీ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ హాజరయ్యారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యెన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, యెన్నం కృష్ణ రెడ్డి, ఎండి రషీద్, అన్ని మండలాల ప్రజాప్రతి నిధులు తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.2.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**తెల్కపల్లి, జూలై 25,(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండల కేంద్రంలోని సబ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్, సీసీ పేవ్‌మెంట్ పనులకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు, వ్యాపా రులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసి, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండ పర్వతాలు, సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, ఉపసర్పంచ్ వారణాసి శ్రీనివాసులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పరుగుల రాణి ప్రవళికకు ఘనంగా సన్మానం

• సింగిల్ విండో చైర్మెన్ - జూపల్లి భాస్కర్ రావు



**వెల్దండ, జూలై 25 (జనంసాక్షి):** చైనా గడ్డపై అండర్ 23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో భారత మహిళల 4ఐ400 మీటర్ల రిలే జట్టుతో కలిసి స్వర్ణ పథకం గెలిచిన నారిమళ్ళ ప్రవళికను వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు శాలువాతో ఘనంగా సన్మానించి, రూ. 50వేల రూపాయలు సర్పంచ్ విజయేందర్ గౌడ్ రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. శనివారం ఉమ్మడి వెల్దండ మండలంలోని జూపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ అనూష జగపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రవళికతో పాటు ఆమె తల్లిదండ్రులను, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జూపల్లి భాస్కరరావు మాట్లాడుతూ.. చైనాలోని ఓర్డోస్ వేదికగా జరిగిన అథ్లెటిక్ ఛాంపియన్షిప్ 2026 లో భారతదేశానికి అద్భుతమైన విజయాన్ని అందించిందని, ప్రవళిక సాధించిన ఈ విజయం, రాష్ట్రానికి దేశానికే గర్వకారణని ఆయన పేర్కొన్నారు. ఒక సాధారణ కుటుంబం తాపీ మేస్త్రి కుటుంబం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన మైలురాయిని అందుకోవడం ఆషామాసి విషయం కాదని పేర్కొన్నారు. పట్టుదల క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేని అంటూ ఏమీ లేదని ఆమె నిరూపించిందని తెలిపారు. ఆమె ప్రస్తుతం నల్గొండ లోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో విద్యనభ్యసిస్తుంది. ఢిల్లీ గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో చేరి అక్కడ లభించిన అత్యుత్తమ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఇయాల అంతర్జాతీయ స్థాయిలో పథకాన్ని సాధించిందని, దేశంలోని యువ క్రీడాకారులు అందరికీ ప్రవళిక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్,చారకొండ సర్పంచ్ విజయేందర్ గౌడ్, ఉప సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సత్య హరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ రాములు యాదవ్, ఎదిరే రవీందర్, ఎండి సిరాజ్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు కంప్యూటర్లు వితరణ చేయడం గొప్ప విషయం



**రాజాపూర్, జూలై 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి హైదరా బాద్ కు చెందిన పాఠశాల విద్యార్థులు తమ పాకెట్ మనీతో కంప్యూటర్లు అందజేయడం చాలా గొప్ప విషయం అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి శశికళారెడ్డి అన్నారు. వారి తల్లిదండ్రులు ఉన్నతంగా ఆలోచన చేసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా పరంగా సహాయం చేయడం మంచి ఆలోచన అని అన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కస్తూర్బా విద్యార్థినులతో పాల్గొన్నారు.

## సీసీటీవీ కెమెరాలతో బాలుడిని గుర్తించిన పోలీసులు

**మల్దకల్, జూలై 25 (జనంసాక్షి):** మండల పరిధిలోని మద్దెలబండ గ్రామానికి చెందిన వీరేష్, తండ్రి పరమేష్, తన తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కొనివ్వలేదనే మనస్తా పంతో జూలై 22 ఉదయం ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఈనెల24 సాయంత్రం కంప్లైంట్ రాగా వెంటనే మల్దకల్ పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.ఈ క్రమంలో పీసీ జైపాల్ రెడ్డి మద్దెలబండ నుండి గద్వాల వరకు ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి,బాలుడి కదలికలను గుర్తించారు. సీసీటీవీ ఆధారాలు,స్థానిక సమాచారంతో గద్వాల బీసీ హాస్టల్ వద్ద బాలుడిని క్షేమంగా గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం శనివారం బాలుడిని అతని తండ్రి పరమేష్‌కు క్షేమంగా అప్పగిం చారు. తమ కుమారుడిని సురక్షితంగా గుర్తించి అప్పగిం చిన మల్దకల్ పోలీసులకు, పీసీ జైపాల్ రెడ్డికి బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.పిల్లలు ఏదైనా కారణంతో ఇంటి నుండి వెళ్లిపోయినప్పుడు లేదా కని పించకుండా పోయినప్పుడు ఆలస్యం చేయకుండా వెంట నే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. ప్రజల భద్రతలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నందున వ్యాపార సంస్థలు, గృహ యజమాను లు తమ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు పనిచేసేలా నిర్వహించాలని మల్ద కల్ పోలీసులు సూచించారు.

## పదవి కన్నా బిజెపికి బాధ్యతే గొప్పది

• రతంగ్ పాండురెడ్డి



**నారాయణపేట, జూలై 25(జనంసాక్షి):** బిజెపి నేతలకు పదవి కన్నా బాధ్యతే గొప్పదని అందుకే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేశారని బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమం నుంచి కేంద్రమంత్రి దాకా పనిచేశారని విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు చేశారని అన్నారు. ప్రజల విశ్వాసం అత్యంత విలువైనదని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బిజెపి స్వాగతిస్తుందని పేర్కొన్నారు.

## పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



**చిన్న శంకరంపేట, జులై25(జనంసాక్షి):** బీహార్‌కు చెందిన తమన్నా ఆమె యొక్క బ్యాగ్‌ను సికింద్రాబాద్ బస్సులో పోగొట్టుకున్నది. చందాపూర్ గ్రామానికి చెందిన పోతురాజు మహేష్ అనే వ్యక్తి అట్టి బ్యాగును యధావిధిగా తీసుకొని వచ్చి పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగింది.అట్టి బ్యాగ్లో ఒక మొబైల్ ఫోన్ ఒక వెయ్యి రూపాయలు నగదు ఉన్నాయి. ఈరోజు ఆ బ్యాగ్‌ని చిన్న శంకరంపేట్ ఎస్ ఐ సదానందం బీహార్‌కు చెందిన తమన్నాకు అందించడం జరిగింది.

## నీటి క్వారీలో పడి రైతు మృతి



**కొల్చారం, జూలై 25(జనంసాక్షి):** కొల్చారం మండలం రాంపూర్ గ్రామ శివారులోని నీటి క్వారీలో ప్రమాదవ శాత్తు పడి ఉసికె కిషన్ (64) మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం తన కుమారుడు రాజశేఖర్‌తో కలిసి వ్యవ సాయ భూమి వద్ద బోర్ మోటార్‌ను నీటి క్వారీలో దింపేందుకు వెళ్లారు. మోటార్‌ను నీటిలో దింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయారు. కుమారుడు వెంటనే నీటిలోకి దిగి తండ్రిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ తెలిపారు.

## తొలి ఏకాదశి సందర్భంగా కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కానాయపల్లి గ్రామంలోని శ్రీశ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన నిరంజన్ రెడ్డి, శ్రీమన్నారాయణుని దివ్య కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, ఆనందం, సౌభాగ్యం నెలకొనాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. తొలి ఏకాదశి ఆధ్యాత్మిక చైతన్యానికి, ధర్మాచరణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్న ఆయన, ఈ సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తి, సేవాభావం, సనాతన సంప్రదాయాల పరిరక్షణతో సమాజంలో సౌహార్ద వాతావరణం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## యువతకు చట్టాలపై అవగాహన కల్పించిన మొబైల్ కోర్టు జడ్జి

**మహమ్మదాబాద్, జూలై 25 (జనంసాక్షి):** యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహమ్మదాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి మహబూబ్‌నగర్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి మునవర్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా,హాజరై విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు బాల్య వివాహాల నిర్మూలన, బాలల రక్షణకు సంబంధించిన, పోక్సో చట్టం,సురక్షిత స్పర్శ-అసురక్షిత స్పర్శ గుర్తింపు, సైబర్ నేరాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. చట్టాలపై అవగాహనతోనే యువత తమ హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని న్యాయమూర్తి సూచించారు. విద్యార్థులు న్యాయ అవగాహనను పెంపొందించుకుని సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక వసతులు తాగునీటి కల్పించండి



**మల్లకల్, జూలై 25(జనంసాక్షి):** మండలంలోని ఎలైట్ గ్రామర్ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు కూడా అందుబాటులో లేవని శనివారం పిడిఎస్యు మండల అధ్యక్షుడు ప్రభు వరుణ్ ఎంఈఓ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వరుణ్ మాట్లాడుతూ బాత్రూములు, మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ ఈ సమస్యలను పరిష్కరించకుండా తగిన వసతులు కల్పించకుండా విద్యాసంస్థను కొనసాగించడం అత్యంత బాధాకరం విషయంకాబట్టి సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే ఎలైట్ గ్రామర్ ప్రైవేట్ స్కూల్‌పై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నడుస్తున్నట్లు తేలితే దాని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించి,సరైన బాత్రూములు, మరుగుదొడ్లు,తాగునీరు ఇతర అవసరమైన సదుపాయాలు లేని పాఠశాలలను గుర్తించి, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అవసరమైతే గుర్తింపులను రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు మండల కార్యదర్శి రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

## తెలకపల్లిలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

- గౌరారంలో ప్రీ ప్రైమరీ తరగతులు, ఇందిరమ్మ ఇండ్ల తనిఖీ..

**తెలకపల్లి, జూలై 25, (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం మండలంలో ఆకస్మికంగా పర్యటించి గౌరారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. గౌరారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, బోధన విధానం, విద్యా సామగ్రి, కల్పిస్తున్న సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రీ ప్రైమరీ విద్య పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ఆటల ద్వారా బోధన, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి చిన్నారి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని సమీక్షించారు. ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం, ప్రభుత్వ మంజూర్ల సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఓటర్ల నమోదు, పెండింగ్ దరఖాస్తులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు ఖచ్చితత్వంతో నమోదు అయ్యేలా చూసి, డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులను పరామర్శించిన మందకృష్ణ మాదిగ

**మిడ్జిల్, జూలై 25(జనంసాక్షి):** ఎమ్మార్పీఎస్ సాధన కోసం ఉద్యమాల్లో పనిచేస్తూ ఉద్యోగరీత్యా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో రెండు కాళ్లు కోల్పోయిన సీనియర్ ఉద్యమ నాయకులు వాద్యాల కృష్ణయ్య. గత కొన్ని సంవత్సరాల కింద షుగర్ వ్యాధితో బాధపడుతూ రెండు కాళ్లు కోల్పోయి బాధపడుతున్న వాద్యాల కృష్ణయ్యను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శుక్రవారం ఆయన స్వగృహంలో వాద్యల గ్రామంలో పరామర్శించారు. ఆరోగ్యంగా ధైర్యంగా ఉండాలని ధైర్యాన్ని ఇవ్వడంతోపాటు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ కుటుంబ భారాన్ని మోస్తున్న కృష్ణయ్యకు కాళ్లు పోవడం బాధాకరంగా ఉందని మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ సమయంలో మంద కృష్ణ మాదిగ తో పాటు కృష్ణయ్య చేసిన పోరాటాలను నెమరు వేసుకున్నారు ఉద్యమ దశలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు జాతి కోసం ఎన్నో పోరాటాలు చేసి అలుపెరుగని నాయకునిగా పోరాడుతున్న మందకృష్ణ మాదిగ ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు టైగర్ జంగయ్య అనారోగ్యంతో జడ్చర్ల కేంద్రంలోని కృష్ణారెడ్డి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రాష్ట్ర నాయకులు జంగయ్య ను మందకృష్ణ మాదిగ పరామర్శించారు. జాతి కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఎమ్మార్పీఎస్ ఉద్యమమే లక్ష్యంగా పనిచేసిన జంగయ్య ను కృష్ణ మాదిగ ఆ లింగనం చేసుకొని పలకరించారు.అధైర్య పడకూడదని



కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చారు. దళిత జాతి బిడ్డల కోసం ఎమ్మార్పీఎస్ ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మార్పీఎస్ నాయకులను కాపాడుకునే బాధ్యత జాతి బిడ్డగా నాకు ఎంతగానో ఉందని సమయం కుదరక కలుసుకోవడానికి కొద్దిగా సమయం పట్టినప్పటికీ నా బిడ్డలుగా నా అన్నదమ్ములుగా మిమ్ములను భావించి మీ యోగక్షేమాలను చూసే బాధ్యత నాపై ఉందని మందకృష్ణ మాదిగ అన్నారు. జాతి కోసం కుటుంబాలను సైతం లెక్కచేయకుండా జాతి మనుగడ కోసం అహర్నిశలు కష్టపడుతూ నాతో కలిసి వచ్చిన మీకందరికీ నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మీకు ఎలాంటి అవసరం ఉన్న నేనున్నానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఉద్యమ నాయకులు దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎల్‌నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి



**నంగునూరు, జూలై 25 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందని ఎంపీడీవో లక్ష్మప్ప పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్, సిద్దన్నపేటలో సర్పంచులు పాకాల శ్రీనివాస్, సంగు పురేందర్ అధ్యక్షతన శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మప్ప మాట్లాడుతూ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించుకునేందుకు తక్కువ నీటి వినియోగం ఉండే పంటలను సాగు చేయడంతో పాటు, నీటి వాడకాన్ని మరింత తగ్గించేందుకు బిందు, తుంపర సేద్యం పరికరాలు వాడి సాగునీటిని పొదుపు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు ఏపీఎం పంచాయతీ కార్యదర్శి అనిత, ఉపసర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, వార్డు సభ్యుడు కందికట్ల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పంగ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బంగారి నర్సింలు పాల్గొన్నారు.

## అన్నయ్యా.... ఆకలి అవుతుంది రా....

- హృదయాన్ని కదిలించే ఘటన



**కొల్చారం, జూలై 25(జనంసాక్షి):** మెదక్ పట్టణంలో కార్వేద్ సంస్థ సలహాతో పనిచేస్తున్న సహన సంస్థ ప్రతినిధి సత్యనారాయణ సంస్థ పరిచయం కోసం పలువురు ప్రముఖులను కలుసుకునేందుకు వెళ్తున్న సమయంలో హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై ఇద్దరు చిన్నారులు కనిపించగా, చిన్నవాడు తన అన్నతో "ఆకలి అవుతుంది రా" అని చెప్పడం సహన సంస్థ ప్రతినిధి సత్యనారాయణ చెవిన పడింది. స్పందించిన ఆయన ఆయన చిన్నారులను సమీపంలోని ఓ స్వీట్ హౌస్‌కు తీసుకెళ్లి వారికి ఇష్టమైన ఆహారం అందించి ఆకలి తీర్చారు. ఆ తర్వాత కొంతసేపు వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి కుటుంబం, చదువు గురించి తెలుసుకున్నారు. "మీరు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్తారా?" అని అడగగా, పెద్ద బాలుడు "మేము ప్రతిరోజూ బడికి వెళ్తాం" తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారని తాను 9వ తరగతి చదువుతున్నానని, క్లాస్ లీడర్‌నని తమ్ముడు 4వ తరగతి చదువుతున్నట్లు తెలిపాడు. దీనిపై స్పందించిన సత్యనారాయణ, పాఠశాల ఉన్న ప్రతి రోజూ తప్పకుండా బడికి వెళ్లాలని, బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారికి సూచించారు. ఆకలితో ఉన్న చిన్నారులకు భోజనం అందించడమే కాకుండా, వారి చదువుపై ఆసక్తిని ప్రోత్సహిస్తూ సమాజం పట్ల మానవత్వాన్ని చాటిన ఈ చిన్న సంఘటన పలువురి ప్రశంసలను అందుకుంది. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవీయ విలువలను మరింత బలోపేతం చేస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## రాజాపూర్ కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**రాజాపూర్, జూలై 25 (జనంసాక్షి):** రాజాపూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిల్లల సేవాభావాన్ని అభినందించారు. విద్యార్థుల కోసం తమ వ్యక్తిగత అవసరాలను పక్కన పెట్టి కంప్యూటర్లను విరాళంగా అందించడం ఆదర్శనీయమని కలెక్టర్ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
విద్యార్థినులు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని, జేఈఈ, నీట్, ఎంసెట్, క్లాట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత విద్య, మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. బాలికలు డిగ్రీతో పాటు ఉన్నత విద్యను పూర్తిచేసి ఆర్థిక స్వావలంబన సాధించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో నిలిపివేయవద్దని చెప్పారు. విద్యార్థులు పరస్పరం సహకరించుకుంటూ ఒకరికొకరు పాఠాలు నేర్చుకోవాలని, కుటుంబ సమస్యలు లేదా ఇతర ఇబ్బందుల కారణంగా చదువుకు ఆటంకం కలిగితే ఉపాధ్యాయులతో పంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సేవా భావం, నాయకత్వ లక్షణాలు, ఉన్నత లక్ష్యాల పట్ల స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు.
**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ...** రాజాపూర్ కేజీబీవీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల భద్రత కోసం కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తిచేస్తామని, సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లను వినోదానికి కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వినియోగించాలని, కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ, తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీవో, స్థానిక సర్పంచ్ రామాకృష్ణ, శశికళా రెడ్డి, శేఖర్ గౌడ్, కస్తూర్బా ఎస్ఓ లక్ష్మీ భాయ్, ఎస్సై రాజాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు గోపాల్ నాయక్‌కు ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి):** వనపర్తి పట్టణం 11వ వార్డు నాగవరం తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఉద్యమ నాయకుడు గోపాల్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ తెలంగాణ ఉద్యమంలో, పార్టీ బలోపేతంలో చేసిన సేవలను నిరంజన్ రెడ్డి స్మరించుకున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, ప్రజలతో మమేకమై పనిచేసిన తీరును కొనియాడారు. గోపాల్ నాయక్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి, వారి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ స్వాతి హరిబాబు, రఘు బ్రదర్స్, వెంకటేష్ గౌడ్, రవికుమార్, సుధాకర్, జగన్ నాయక్, రామదాసు, రాజు, యాదగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.


## కోచింగ్ సెంటర్‌పై
# చర్యలు తీసుకోవాలి: పిడిఎస్‌యు




**అయిజ, జూలై 25 (జనంసాక్షి):** అయిజ పట్టణంలో ఆదర్శ విద్యా మందిర్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని, మండల విద్యాశాఖ అధికారికి, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పిడిఎస్‌యు, జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ, ఐజ మండల కేంద్రంలోని "ఆదర్శ విద్యా మందిర్" స్కూల్ పేరుతో కోచింగ్ సెంటర్ మరియు హాస్టల్ నిర్వహించబడుతున్నట్లు తెలిసింది. అక్కడ సుమారు 300 మంది విద్యార్థులు మరియు విద్యార్థినులను హాస్టల్ పేరుతో ఉంచి కోచింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం ఉంది. సదరు కోచింగ్ సెంటర్,హాస్టల్ నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా, అనే విషయాన్ని పరిశీలించి విచారణ జరిపించవలసిందిగా కోరుతున్నాట్లు వారు తెలిపారు. ఒకవేళ అవసరమైన అనుమతులు లేకుండా సంస్థను నిర్వహిస్తున్నట్లు తేలిన పక్షంలో, చట్టపంమైన నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకొని, అవసరమైతే సదరు సంస్థను సీజ్ చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు, మల్దకల్ మండల అధ్యక్షులు ప్రభు వరుణ్ కార్యదర్శి చందు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధల మధ్య తొలి ఏకాదశి వేడుకలు

- **అభిషేకం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న బొజ్జ అమరేందర్ రెడ్డి**



**ఉప్పునుంతల, జూలై 25 (జనంసాక్షి):** తొలి ఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలోని శివాలయం వద్ద శనివారం భక్తిశ్రద్ధల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందించడమే కాకుండా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ పండుగలను భక్తితోపాటు సేవాభావంతో నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఆచారి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఖిల్లాలో ఘనంగా బోనాల వేడుకలు

- **అమ్మ పోచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలి**
- **బిజెవైఎం.రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిసాల సాయినాథ్**



**ఖిల్లా ఘనపురం, 24,జులై, (జనంసాక్షి):** మండల కేంద్రంలో గురువారం బోనాల పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయలు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిసాల సాయినాథ్ అమ్మ పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మ పోచమ్మ తల్లి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం జరిగే బోనాల పండుగలో గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులు తీర్చుకోవడం ఆనంద దాయకమని తెలిపారు.కిందిగేరి బోనాలు గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని, అలాగే గంగాపుత్ర కాలనీలో వెలసిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని అన్నారు. స్థానిక ప్రజలతో కలిసి అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బుచ్చిబాబు గౌడ్, గోపాల్ ముదిరాజ్, గోపాల్, శివశంకర్, ఆశన్న, రామచంద్రీ, అనిల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహణ

- **250 జంటలతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు**



**నాగర్‌కర్నూల్, జూలై 25 (జనంసాక్షి):** బీజినేపల్లి మండలం పాలెం గ్రామంలో భక్తులతో కిటకిటలాడిన ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అర్చకులు వ్రతాలు ఆచరించిన భక్తులకు స్వామివారి విశేష అనుగ్రహం లభిస్తుందని ప్రధాన అర్చకులు కొరవి రామానుజాచార్యులు వెల్లడించారు. ఆషాఢ మాసంలో శ్రీ సత్యనారాయణ వ్రతం ఆచరించడం అత్యంత పుణ్యప్రదమని సూచించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల భారీ రద్దీ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్న భక్తులు, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగిన సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల పంపిణీ చేశారు.

## అనారోగ్యంతో ఉన్న గొంది భాస్కర్ నాయుడిని పరామర్శించిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, జూలై 25, (జనంసాక్షి):** వనపర్తి పట్టణం 33వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గొంది భాస్కర్ నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్, శిరీవాటి శంకర్, ఖాదర్షా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పాలెం డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం

- **కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాములు**



**నాగర్‌కర్నూల్, జూలై 25 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) వాణిజ్యశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ మరియు అప్లికేషన్స్, పాల శాస్త్రం (డెయిరీ సైన్స్) ఆంగ్లం, ఆరోగ్య సంరక్షణ నిర్వహణ (హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) రాజకీయ శాస్త్రం, తెలుగు విభాగాల్లో అతిథి అధ్యాపకుల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హతల ధృవపత్రాలు, మార్కుల మెమోలు, అనుభవ ధృవపత్రాలు మరియు ఇతర సంబంధిత పత్రాలను జతచేసి జూలై 20, 2026 సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.సంబంధిత సబ్జెక్టులో పీజీ విద్యలో సాధారణ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ, నెట్, స్లెట్ లేదా సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అలాంటి అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో సంబంధిత సబ్జెక్టులో పీజీ అర్హత కలిగిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు అదనపు వెయిటేజ్ కల్పించనున్నట్లు తెలిపారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.రాములు కోరారు.

## ఎంఎస్ఎస్ఓ ద్వారా మంజూరైన మోటారును ప్రారంభించిన ఎమ్మెల్యే



**హవేలి ఘన్పూర్, జూలై 25 (జనంసాక్షి):** హవేలి ఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఎం ఎస్ ఎస్ ఓ ద్వారా మంజూరైన తాగునీటి మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడం సంతోషకరమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ భూలి పుల్యా నాయక్, ఉప సర్పంచ్ దేవుల, వార్డు సభ్యులు లాల్య, సూర్య, గణేష్, అలాగే తండా పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

- **ఆలయాల్లో భక్తుల సందడి**



**మెదక్ టౌన్, జూలై 25 (జనంసాక్షి):** హిందువులు పవిత్రంగా జరుపుకునే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం తొలిఏకాదశి పర్వదినం కలిసిరావడంతో చాలా మంది భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. అలాగే పట్టణంలోని చమన్ హనుమాన్ ఆలయం, శ్రీ వేంకటేశ్వర ఆలయం, శ్రీ కోదండ ఆలయం ప్రాంగణంలో గల శివాలయం, శనేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.

## చుంచనకోట కొత్తచెరువు వద్ద ఈత మొక్కల ప్లాంటేషన్

- **ఎక్సైజ్ ఎస్సై, సర్పంచ్, గ్రామ ప్రజల భాగస్వామ్యం**



**చేర్యాల, జూలై 25(జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం మండలంలోని చుంచనకోట గ్రామంలోని కొత్తచెరువు వద్ద ఈత మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ శాఖ ఎస్సై సురేష్, సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ.. చెట్లు నాటడం వల్లనే వాతావరణ సమతుల్యత కుదురుతుంది. యువత చెట్ల సంరక్షణకు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. కొత్తచెరువు చుట్టూ పచ్చదనం పెంచేందుకు ఈ ప్లాంటేషన్ చేపట్టాం. నాటిన ప్రతి మొక్కను కాపాడే బాధ్యత అందరిదీ అని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ తో పాటు గ్రామ ఉప సర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్ రాజకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్, తరిగొప్పుల వెంకటేష్, కారోబార్ రాజు, గ్రామ వార్డు సభ్యులు, గౌడ సంఘం ఛైర్మన్ బూడిద అంజయ్య, గౌడ కులస్తులు, ఉపాధి కూలీలతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

## ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ మోహన్ నాయక్



**మెదక్ రూరల్, జూలై 25(జనంసాక్షి):** మెదక్ మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన తుపాకుల నవీన్ ఆర్థిక సమస్యలతో మరణించారు ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, మధు ,వెంకటేష్, ,శేఖర్, మహేష్ ,సురేష్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లాఠీలను ఎదిరించి.. ఢిల్లీ పీఠాన్ని కదిలించి

- **నీట్ ఉద్యమం విద్యార్థుల చారిత్రక విజయం: చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే, సంగారెడ్డి**



**సంగారెడ్డి, జూలై 25 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశలను, కలలను ఛిద్రం చేసిన 'నీట్' పేపర్ లీకేజీ కుంభకోణం కేంద్ర ప్రభుత్వ చేతకానితనానికి నిలువెత్తు అద్దం పడుతోంది. ఎన్నో ఏళ్లుగా రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తును కొందరు దళారులు, అక్రమార్కులు మార్కెట్లో అమ్ముకోవడం మన విద్యా వ్యవస్థకే అతిపెద్ద అవమానం. అయితే, ఈ అన్యాయాన్ని మౌనంగా భరించకుండా తమ హక్కుల సాధన కోసం నేటి యువత ఢిల్లీ వీధుల్లోకి వచ్చి చేసిన పోరాటం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం.

సత్యాన్ని ఎంతకాలం దాచినా సూర్యుడిని మేఘాలు శాశ్వతంగా కప్పలేనట్లే"లి విద్యార్థుల ఆవేదన దేశ ప్రజల ముందుకు వచ్చింది. లాఠీ దెబ్బలకు నెత్తురోడుతున్నా వెనక్కి తగ్గని యువత ధైర్యం దేశానికి స్ఫూర్తిగా నిలిచింది. **"నిప్పును గుప్పెట్లో దాచలేరు"** అన్నట్లు, నీట్ అక్రమాల నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. తమకు జరిగిన అన్యాయంపై నిలదీస్తూ, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో విద్యార్థులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలు, శాంతియుత ఆందోళనలు దేశం మొత్తాన్ని కదిలించాయి. కానీ, విద్యార్థుల బాధను అర్థం చేసుకుని భరోసా ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం.. వారిపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం అత్యంత దారుణం. హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో, దౌర్జన్యాలతో అణచివేయాలని చూడటం పాలకుల అహంకారానికి నిదర్శనం. లాఠీ దెబ్బలకు నెత్తురోడుతున్నా వెనక్కి తగ్గకుండా నిలబడిన యువత తెగువ ముందు కేంద్రం అణచివేత వ్యూహాలు పటాపంచలయ్యాయి. ఈ మహోద్యమం దెబ్బకు ఎట్టకేలకు ఢిల్లీ పీఠం కదిలింది. లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీధుల్లోకి వచ్చి నినదిస్తుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కేవలం నామమాత్రపు ప్రకటనలు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. కానీ, యువత పట్టువదలని పోరాటం, దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆగ్రహం చూసి చివరికి కేంద్ర ప్రభుత్వం మెట్టు దిగక తప్పలేదు.

ఈ అక్రమాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం ముమ్మాటికీ మన విద్యార్థుల పోరాట విజయమే. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదు.. ఢిల్లీ పాలకుల అహంకారంపై మన 'Gen Z' సాధించిన చారిత్రాత్మక విజయం. ఈ నీట్ పోరాటం దేశ యువత ఆత్మగౌరవ సమరానికి ప్రతీకగా నిలిచింది. ఈ తరం యువత కేవలం సోషల్ మీడియాకే పరిమితం అని తక్కువ అంచనా వేసిన వారికి.. వాళ్లు రోడ్ల మీదకు వస్తే ఎంతటి బలమైన ప్రభుత్వాలైనా తలవంచక తప్పదని ఈ ఉద్యమం నిరూపించింది. అయితే మంత్రి రాజీనామాతోనే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. నీట్ అక్రమాల వెనుక ఉన్న అసలు సూత్రధారులందరికీ కఠిన శిక్షలు పడేవరకు, బాధితులైన ప్రతి విద్యార్థికీ న్యాయం జరిగే వరకు ఈ పోరాట స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలి. విద్యా వ్యవస్థలో పూర్తి పారదర్శకత తీసుకువచ్చేంత వరకు విద్యార్థులకు, యువతకు అండగా నిలబడతాం.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ సమన్వయకర్తగా డా. వర్కాల శ్రీనివాసులు



**నాగర్‌కర్నూల్, జూలై 25 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల కు నూతనంగా మంజూరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కు సమన్వయకర్తగా డా. వర్కాల శ్రీనివాసులు కు బాధ్యతలు అప్పగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా స్టడీ సెంటర్ సమన్వయకర్త డా. వర్కాల శ్రీనివాసులు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న దూరవిద్యా విధానం ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు, మధ్యలో చదువు నిలిపివేసిన వారు, వివిధ కారణాలతో రెగ్యులర్ విద్యను కొనసాగించలేకపోయిన వారు, అలాగే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.2026-27 విద్యా సంవత్సరానికి బి.ఏ., బి.కాం., బి.ఎస్‌సి. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, విద్యార్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓపెన్ యూనివర్సిటీ విద్యా విధానం ద్వారా ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుందని, స్వయం అధ్యయనంతో పాటు అకడమిక్ కౌన్సెలింగ్, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ వంటి అన్ని సౌకర్యాలు యూనివర్సిటీ ద్వారా అందుబాటులో ఉంటాయని వివరించారు.అభ్యర్థులు ప్రవేశాలకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు విధానం, కోర్సుల ఎంపిక, ఫీజుల వివరాలు, ప్రవేశాల గడువు తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడానికి స్టడీ సెంటర్‌ను నేరుగా సంప్రదించాలని డా. వర్కాల శ్రీనివాసులు కోరారు. ఉన్నత విద్యకు వయోపరిమితి అడ్డంకి కాదని, చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ విద్యా లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మరియు చదువును మధ్యలో నిలిపివేసిన యువత అధిక సంఖ్యలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


## తొలి ఏకాదశి నాడు శ్రీశనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు



**నాగర్‌కర్నూల్, జూలై 25 (జనంసాక్షి):** శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి నాడు శనివారం, దేవత నక్షత్రము నాడు బిజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకాలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్ఠమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ, ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రీత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్దారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్లండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో భక్తి వెల్లువ.. 91వ శ్రీకృష్ణ చతుర్భుజ మహాయాగం వైభవం

- నేటితో ఎనిమిదవ రోజుకు చేరిన మహాయజ్ఞం..
- వేలాది భక్తులతో కిటకిటలాడిన యాగశాల
- విశిష్ట హోమాలు..వేదఘోషలు..స్వామీజీ ధర్మ సందేశాలు..
- నిత్య అన్నదానంతో ఆధ్యాత్మిక క్షేత్రంగా కల్వకుర్తి



కల్వకుర్తి,జూలై 25(జనంసాక్షి ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో జరుగుతున్న 91వ శ్రీకృష్ణ చతుర్భుజ మహాయాగం భక్తి పారవశ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో జూలై 19న ప్రారంభమైన ఈ మహాయాగం నేటితో ఏడో రోజుకు చేరుకోగా,రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,మహారాష్ట్ర రాష్ట్రాలనుంచి వేలాదిమంది భక్తులుతరలివచ్చి హోమాల్లో పాల్గొంటూప్రత్యేక సంకల్పాలు చేయించుకుంటున్నారు. యాగశాల అంతా వేద మంత్రాల నినాదాలు, అగ్నిహోత్రాల జ్వాలలు, భజనలు, హారతులు, ధర్మప్రవచనాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**నేటి కార్యక్రమాలు ఘనంగా...**

శనివారం ఉదయం బ్రహ్మముహూర్తంలో గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతి హోమం, నవగ్రహారాధన, కలశారాధన, వేదపారాయణం, విశేష అభిషేకాలు, మహానైవేద్యం నిర్వహించారు. ఆ తరువాత శ్రీ సుదర్శన హోమం, శ్రీ రుద్ర హోమం, శ్రీ మహాలక్ష్మి హోమం, నాగదేవతల విశేష పూజలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక సంకల్పాలు చేయించుకున్నారు.సాయంత్రం దీపారాధన, భజన కార్యక్రమాలు,మంగళహారతి, ఆధ్యాత్మిక సత్సంగం, శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ధర్మప్రవచనం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

**8 వేలమందికి పైగా భక్తుల రాక...**

నేటి కార్యక్రమాలకు సుమారు 8 వేల మందికి పైగా భక్తులు హాజరై హోమాలు, పూజలు, ప్రవచనాల్లో పాల్గొన్నారు. యాగశాల ప్రాంగణం ఉదయం నుంచే భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు కుంకుమార్చనలు, పురుషులు ప్రత్యేక పూజలు, యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొని మహాయాగాన్ని విజయవంతం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కల్వకుర్తి పట్టణం ఆధ్యాత్మిక క్షేత్రంగా మారింది.

**అన్నదానానికి అపూర్వ స్పందన...**

మహాయాగంలో పాల్గొన్న ప్రతి భక్తికి నిత్యం అన్నప్రసాదం అందిస్తున్నారు. శనివారం నిర్వహించిన మహా అన్నదానంలో 8 వేల మందికి పైగా భక్తులు ప్రసాదం స్వీకరించారు. సేవా దాతలు స్వచ్ఛందంగా అన్నదానంలో భాగస్వాములు కావడం విశేషం. తాగునీరు, విశ్రాంతి, తీర్థప్రసాదం, ప్రత్యేక దర్శనాల ఏర్పాట్లు భక్తులకు అందుబాటులో ఉంచారు.

**నేటివరకు విశేష హోమాలు...**

జూలై 19 నుంచి ఇప్పటివరకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప స్వామి హోమం, ధన్వంతరి హోమం, దుర్గాదేవి హోమం, లక్ష్మీనృసింహ హోమం, వేంకటేశ్వర స్వామి హోమం, ఉమామహేశ్వర హోమం, రాజరాజేశ్వరి హోమం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హోమం, నాగదేవతల పూజలు, విశేష అభిషేకాలు, రామాయణ పారాయణం, శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని దైవానుగ్రహం పొందారు.

**ఆగస్టు 3న మహాపూర్ణాహుతి...**

జూలై 26 నుంచి ఆగస్టు 3 వరకు శ్రీ హనుమత్ హోమం, శ్రీకృష్ణ హోమం, శ్రీ మహాలక్ష్మి హోమం, శ్రీ సీతారాముల కళ్యాణం, శ్రీ రాధాకృష్ణ శాంతి కళ్యాణం తదితర విశిష్ట కార్యక్రమాలు కొనసాగనున్నాయి. చివరి రోజైన ఆగస్టు 3న మహాహోమాలు, మహాపూర్ణాహుతి, శ్రీకృష్ణ జ్యోతి ఉట్టోత్సవం, శ్రీ రాధాకృష్ణ శాంతి కళ్యాణం, మహామంగళహారతి, మహా అన్నదానంతో మహాయాగం వైభవంగా ముగియనుంది.

**సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం...**

సనాతన ధర్మ పరిరక్షణ, విశ్వశాంతి, లోకక్షేమం, ప్రకృతి సమతుల్యత, రైతాంగ సంక్షేమం, కుటుంబ సౌఖ్యం, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే మహాయాగం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థుల పోరాటం, రాహుల్ గాంధీ మద్దతు ఫలితమే

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- రాహుల్ గాంధీ విజయోత్సవ ర్యాలీ






సంగారెడ్డి, జూలై 25 (జనంసాక్షి): విద్యార్థుల పోరాటం రాహుల్ గాంధీ మద్దతు ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో "రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీ" నిర్వహించారు. ఐబీ గెస్ట్ హౌస్ నుంచి పాత బస్టాండ్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థుల ప్రయోజనాల కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. నీట్ పరీక్షల అంశంపై రాహుల్ గాంధీ చేసిన ఉద్యమాల వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలు జాతీయస్థాయిలో చర్చకు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై రాహుల్ గాంధీ ఎక్కడ పోరాటానికి పిలుపునిచ్చినా సంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు ముందుంటాయని తెలిపారు. దేశంలో ప్రజలు సుఖశాంతులతో, భద్రతతో జీవించాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలని, కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతారని జగ్గారెడ్డి అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్ మాట్లాడుతూ, ఏఐసీసీ ఇచ్చే కార్యక్రమాల కంటే మరింత ఉత్సాహంగా జగ్గారెడ్డి సంగారెడ్డిలో కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రశంసించారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని పేర్కొన్నారు. ప్రజా బాధ్యతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చిందని, గతంలో బాధ్యతాయుతంగా పదవులకు రాజీనామాలు చేసిన కాంగ్రెస్ నాయకుల చరిత్ర దీనికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత ,సంతోష్ కుమార్ వైస్ చైర్మన్ షఫీతో పాజి అనంత కిషన్, జార్జ్, కిరణ్, తులసీ రామ్, తదితరులు పాల్గొన్నారు


## పేటలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిపై సంతకాల సేకరణ



నారాయణపేట, జూలై 25(జనంసాక్షి): బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఫీజుల బకాయి బిజెపి లడాయి కార్యక్రమం లో భాగంగా శనివారం నారాయణపేట పట్టణం లోని వివిధ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు రావలసిన ఫీజు రీయిం బర్స్మెంట్ ,స్కాలర్షిప్ బకాయిల వివరాలతో కూడిన సంతకాల సేకరణ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్ మాట్లా డుతూ, 2021 నుండి 2026 వరకు విద్యార్థులకు రావాల్సిన ఫీజురియంబర్స్మెంట్ ,స్కాలర్షిప్స్ ఇవ్వకుండా ప్రభు త్వం విద్యార్థుల జీవితాల తో చెలగాటం ఆడుతున్న దని అన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో కళాశాల యాజమాన్యం రియంబర్స్మెంట్ రాకపోవడంతో చాలా ఇబ్బందు లతో కళాశాల నడుపుతున్నార న్నారు.ప్రభుత్వానికి విద్యా ర్థుల ఫీజు రియాంబర్స్మెం ట్,స్కాలర్ షిప్ చెల్లించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వం నిర్లక్ష్యం విడడం లేదని అన్నారు. విద్యా ర్థుల సమస్యల సాధన కోసం మునుముందు బిజెవైఎం కార్యాచరణ రూపొందించి ఉద్యమం ఉధృతం చేస్తా మనిహెచ్చరించారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయ కులు మోహన్, మనీ మోదీ, ప్రకాష్, డి మణి, అంజి, చేతన్, అరవింద్, నవీన్ చామకూర, బాలకృష్ణ, గోకుల్, ఏబీవీపీ నాయ కులు నరేష్, చరణ్ ఇంతి యాజ్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

- తెల్లాపూర్‌లో అవగాహన ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




రామచంద్రాపురం, జూలై 25(జనంసాక్షి): అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్‌మెంట్ సమీపంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటు కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఆయుధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఓటు కీలకమని, అందువల్ల అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భయంతో గ్రామస్తులు

- చర్యలు తీసుకోవాలని తిమ్మాక్కపల్లి గ్రామస్థుల విజ్ఞప్తి



మెదక్ రూరల్, జూలై 25 (జనంసాక్షి): మెదక్ మండలం లోని తిమ్మకపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో పాటు విద్యుత్ వైర్లు కూడా కిందకు వంగి ఉండటం ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతంలో నీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదం మరింత పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, గ్రామస్థులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రపరిచి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.